క్లుప్తంగా

డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించాలి



రేపల్లె: పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ స్కూల్ పక్కనే ఉన్న డంపింగ్ యార్డులోని చెత్తను తగలబెట్టటంతో దాని నుంచి వచ్చే దుర్వాసనతో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, విద్యార్థుల కోసం వచ్చే తల్లిదండ్రులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఆర్డీవో నేలపు రామలక్ష్మి వద్ద తల్లిదండ్రులు మొరపెట్టుకున్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. డంపింగ్ యార్డు నుంచి వచ్చే పొగ, దుర్వాసనతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని తల్లిదండ్రులు అందించిన అర్జీలలో పేర్కొన్నారన్నారు. సమస్యను పరిశీలించి సంబంధిత శాఖ అధికారులచే పరిష్కరించబడునని తెలిపారు.

ఎన్‌సీసీ శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లు



నగరం: నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఎన్‌సీసీ శిక్షణ దోహదపడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ చెప్పారు. స్థానిక ఎస్వీఆర్‌ఎం కళాశాలలో సోమవారం ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు బీ, సీ సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఎన్‌సీసీలో చేరాలని, ఎన్‌సీసీతో దేశభక్తి, క్రమశిక్షణ అలవడతాయన్నారు. ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసి బీ, సీ సర్టిఫికెట్‌లు సాధించిన విద్యార్థులకు ఉద్యోగాలలో రాయితీలు వర్తిస్తాయన్నారు. అనంతరం 22 ఆంధ్రా బెటాలియన్ కల్నల్‌లు ఉదయ్‌కుమార్, గురుదీప్‌సింగ్‌లు 16 మందికి బీ, 10 మందికి సీ సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. సర్టిఫికెట్‌లు పొందిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ సాంబమూర్తి పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ, భోజన పేట్లు అందజేత



నిజాంపట్నం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అవసరమని నిజాంపట్నం మండల విద్యాశాఖ అధికారి జీ శేషు గోపాలం అన్నారు. సోమవారం మండలంలోని ఎక్స్‌సర్వీస్ మెన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రిటైర్డ్ జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి తాతా వెంకటేశ్వరరావు, మాజీ సైనిక ఉద్యోగి తాతా నాగేశ్వరరావులు చేయూతనిచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాలకు అవసరమైన టీవీతో పాటు పాఠశాల విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లోనూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో దాతలు రిటైర్డ్ జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి తాతా వెంకటేశ్వరరావు, మాజీ సైనిక ఉద్యోగి తాతా నాగేశ్వరరావు, హెచ్‌ఎం చుక్కా బాపయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ జి.రజిని, ఉపాధ్యాయురాలు షేక్ ఆరిఫున్నీసా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలకు బల్లలు, ప్లేట్లు అందజేత



పేరలి(కర్లపాలెం): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు బాపట్ల అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ చేయూతనందించటం అభినందనీయమని జనసేన జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, చెప్పారు. పేరలి మోడల్ ప్రాథమిక పాఠశాలకు సోమవారం బాపట్ల అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు, జనసేన నాయకుడు విన్నకోట సురేష్ ఆర్థిక సహకారంతో బల్లలు, స్టీలు ప్లేట్లు, బుక్స్, మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా తులసీకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులపై కూడా ఉందని దాతల సహకారాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అఖండ ఫౌండేషన్ సభ్యులు, జనసేన నాయకులు గొట్టిపాటి శ్రీకృష్ణ, పసుపులేటి మహేష్, విష్ణు మొలకల చంద్రమోహన్, పడమటి ధర్మారావ్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



వలివేరు గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో వరికూటి అశోక్‌బాబు

చుండూరు(వేమూరు): సూపర్ సిక్స్ హామీల ద్వారా ప్రజలందరినీ మోసం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వర్షంలో సైతం ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాల గురించి ఆయన వివరించారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని హామీలిచ్చి అధికారం చేపట్టిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు మరిచి పోవడం జరిగిందని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని ఇంత వరకు ఒక్క ఉద్యోగం కూడా కల్పించలేదన్నారు. నిరుద్యోగ భృతి గాలికి వదిలి వేశారన్నారు. వలంటీర్లకు గౌరవ వేతనం రూ.10 వేలు చేస్తామని చెప్పి వలంటీర్లనే తీసేసారన్నారు. జగనన్న అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాల ద్వారా ప్రతి మహిళ అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళలందరు జగనన్నకు అండగా ఉండాలని కోరారు.

పాతకోటి శేషమ్మ కుటుంబానికి రూ.23,59,000

మండలంలోని వలివేరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నపుడు పాతకోటి శేషమ్మ కుటుంబానికి రూ.23,59,000 సహాయం అందించడం జరిగింది. శేషమ్మకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారికి గత ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందించడం జరిగింది. శేషమ్మకు– రూ.2,15,000, పెద్ద కోడలు లక్ష్మి అన్నపూర్ణకు– రూ.8,15,000, రెండవ కోడళ్లు నాగలక్ష్మికి– రూ.11,79,000, మూడవ కోడలు పార్వతికి– రూ.1,50,000 గత ప్రభుత్వం అందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పైసా కూడా వారికి అందజేయలేదన్నారు. ఇలా ఈ ఒక్క కుటుంబానికే కాదు ఎవరికీ కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గాదె శివరామకృష్ణారెడ్డి, దాట్ల మోహన్ రెడ్డి, పందిపాటి ఏసు, అమర్తలూరు ప్రవీణ్, చీడేపూడి సాంబరెడ్డి, కొండమూది ప్రసాద్, దాసరి వసంతరావు, ఈమని శ్రీనివాసరెడ్డి, తిప్పల వెంకటరామి రెడ్డి, జి.గురవారెడ్డి, రవీంద్ర రెడ్డి, అరమళ్ల వంశీకృష్ణా రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవులు దక్కినవారు పార్టీ అభ్యున్నతికి పాటుపడాలి

వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



అంకబాబును అభినందిస్తున్న వరికూటి అశోక్‌బాబు తదితరులు

భట్టిప్రోలు : పదవులు పొందినవారు వాటిని అలంకారంగా భావించకుండా పార్టీ అభ్యున్నతికి కృషి చేసే విధంగా కష్టపడి పని చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ భట్టిప్రోలు మండల ట్రేడ్ యూనియన్ నాయకుడిగా నియమితులైన వాకా అంకబాబును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు వెళుతూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, తనకు పదవి దక్కడానికి కృషి చేసిన వరికూటి అశోక్‌బాబుకు ఈ సందర్భంగా అంకబాబు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పడమట శ్రీనివాసరావు, నాయకులు గోవర్ధనగిరి వెంకట సీతమల్లేశ్వరరావు, కుందేటి రమేష్, సత్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కరుణించిన వరుణుడు



క్రాప రోడ్డు వద్ద వెద పద్ధతిలో సాగు చేసిన వరి పొలంలో నిలిచిన వర్షపు నీరు

వర్షంతో ఖరీఫ్ సాగుకు ఊపిరి

కొల్లూరు : ఖరీఫ్ సాగుకు నీటి ఎద్దడితో సతమతమవుతున్న రైతులను వరుణుడు ఆదుకున్నాడు. ఆదివారం రాత్రి నుంచి అడపాదడపా ఓ మోస్తరుగా వర్షం కురుస్తుండటంతో మండలంలో వెద పద్ధతిలో సాగైన వరి పంటకు నీటి కొరత తీరి పంట ఊపురులు అద్దుకుంటుంది. పంట కాలువల ద్వారా సాగు నీరు విడుదల అయినప్పటికీ చివరి భూములకు నీరు చేరకపోవడంతో వేడి గాలులకు పంట దెబ్బతింటుందన్న ఆందోళనలో రైతులు సతమతమయ్యారు. ఆయిల్ ఇంజిన్లు, విద్యుత్ మోటార్ల సాయంతో నీరు అందించలేక నష్టం వాటిల్లుతుందన్న ఆందోళనకు వర్షంతో తెరపడింది. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు స్మృతిమించి భారీ వర్షాలు కురిస్తే పంట పనికిరాకుండా పోతుందన్న ఆందోళన రైతులను వెంటాడుతుంది.

తూటికాడలో ఇరుక్కుపోయి గేదె మృతి



మురుగు కాలువలో తూటికాడలో ఇరుక్కొని మృతి చెందిన గేదె

పోతుమర్రు(వేమూరు): జంపని గ్రామం వద్ద గంగోలు మురుగు కాలువలో తూటికాడలో గేదె ఇరుక్కుపోయి మృతి చెందింది. వేమూరు మండలంలోని పోతుమర్రు గ్రామానికి చెందిన ఎస్టీ సామాజికవర్గానికి చెందిన సొటిరి పిచ్చియ్యకు నాలుగు గేదెలు ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం గేదెలను పొలం తోలుకొని వెళ్లాడు. మురుగు కాలువలో తూటికాడ విపరీతంగా ఉంది. గేదెలు మురుగు కాలువలోకి దిగగా, మూడు గేదెలు వచ్చాయి, ఒక గేదె తూటికాడలో ఇరుక్కొని మునిగిపోయింది. సోమవారం గేదె మృతి చెంది బయటకు వచ్చింది. కూటమి ప్రభుత్వం మురుగు కాలువల్లో తూటికాడ తొలగించకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని బాధిత రైతు పిచ్చియ్య అన్నాడు. గేదె మృతి చెందడం వల్ల రూ.80 వేలు నష్టం జరిగిందని, కూటమి ప్రభుత్వం మురుగు కాలువల్లో తూటికాడ తొలగించాలని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

రేపు ప్రకాశం స్మారక ఉపన్యాసం

బాపట్ల అర్బన్: ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం స్మారక ఉపన్యాసం ఈ నెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలకు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో జరుగుతుందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పి.సి.సాయిబాబు తెలిపారు. ఒంగోలు ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య డీవీఆర్ మూర్తి ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. టంగుటూరి ప్రకాశం పంతులు ప్రకాశం, బాపట్ల జిల్లాలోనే విద్యాభ్యాసం చేశారని, అద్దంకిలోనే వివాహం చేసుకున్నారని గుర్తు చేశారు. ప్రకాశం అభివృద్ధి అధ్యాయన సంస్థ, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోగా విజయ బాబు బాధ్యతల స్వీకారం



భట్టిప్రోలు: భట్టిప్రోలు డిప్యూటీ ఎంపీడీవోగా ఈవూరు విజయబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రేపల్లె నియోజకవర్గ పరిధిలోని చెరుకుపల్లి పంచాయతీ గ్రేడ్–1 కార్యదర్శిగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై భట్టిప్రోలు విచ్చేసినట్లు ఎంపీడీవో ఎస్.వెంకట రమణ తెలిపారు. ఇప్పటి వరకు ఐలవరం కార్యదర్శి కోటేశ్వరరావు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. బాధ్యతలు స్వీకరించిన విజయబాబుకు ఎస్‌ఎస్‌ఎఫ్ బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

వెల్లటూరులో ఏకాదశి పూజలు



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు సోమవారం ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హరేరామ–హరేకృష్ణ నామ పారాయణ కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్పెంటర్స్ విధిగా సభ్యత్వ నమోదు చేసుకోవాలి



భట్టిప్రోలు: కార్పెంటర్స్ విధిగా సభ్యత్వ నమోదు, రెన్యువల్ చేసుకోవాలని బాపట్ల జిల్లా భట్టిప్రోలు కార్పెంటర్స్ అసోసియేషన్ నాయకులు కోడూరు వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ వెబ్‌సైట్ ద్వారా సెల్‌ఫోన్‌లోనే ప్రతి కార్పెంటర్ సభ్యత్వ నమోదు, రెన్యువల్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

ప్లాస్టిక్ రహిత బాపట్లకు చర్యలు



బాపట్ల అర్బన్ : ప్లాస్టిక్ రహిత బాపట్లగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి కోరారు. కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలోని వ్యాపారులపై ఆకస్మికంగా తనిఖీలు చేసి ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేశారు. ఎక్కడైనా భారీగా ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు ఉంటే వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సీహెచ్ కరుణ, నజీర్ పాల్గొన్నారు.

పెరటి తోటలపై విద్యార్థులకు అవగాహన



భట్టిప్రోలు: బడి పిల్లలకు పెరటి తోటల పెంపకంపై టీఎంరావు హైస్కూల్‌లో సోమవారం అవగాహన కల్పించారు. భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్, ఈసీ మెంబర్ మాచర్ల వెంకటేశ్వరరావు, ఉద్యానవన శాఖ అధికారి జి.కల్యాణ చక్రవర్తి, ఏఈవో లక్ష్మి ప్రసన్నలు పెరటి తోటలు గురించి తెలియజేశారు. ఆకుకూరలు, కూరగాయలు పెంచడానికి అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచారు. అలాగే ఉద్యాన, వ్యవసాయ శాఖ ముందుకు వచ్చాయి. హెచ్‌ఎం సి.రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కిల్డ్ వేతనాలు అమలు చేసే వరకు సమ్మె విరమించం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

రేపల్లె: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు అమలు చేసే వరకు సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ చెప్పారు. సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె సోమవారంతో 8వ రోజుకు చేరింది. సమ్మెకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. సమ్మె శిబిరాన్ని సందర్శించిన మణిలాల్ మాట్లాడుతూ కార్మికులకు కేటగిరీల వారీగా రూ.2 వేలు, రూ.3 వేలు పెంచుతాం సమ్మె విరమించాలని, ప్రభుత్వం ప్రకటించటం సమంజసం కాదన్నారు. కార్మికులను మరోమారు మోసం చేసేందుకు కూటమి ప్రభుత్వం పూనుకుంటోందని విమర్శించారు. స్కిల్డ్ వేతనాలు అమలు చేసేంత వరకు పోరాటం ఆగదన్నారు. జీవో 36 ప్రకారం వేతనం అమలు చేయాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ.14 వేలు అందిస్తూ కార్మికుల శ్రమ దోచుకుంటోందన్నారు. అదనంగా మరో రూ.2 వేలు పెంచుతాం సమ్మె విరమించండని ప్రభుత్వ పెద్దలు చెప్పటం బాధాకరమన్నారు. డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం అంగీకరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షుడు ప్రభాకరరావు, నాయకులు రవి, రాఘవేంద్రరావు, రవిబాబు, శ్రీను, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఫోన్ యాప్‌ల భారాన్ని తగ్గించాలి



పల్లపట్ల సీడీపీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



సీడీపీవో సుచిత్రకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్



అమర్తలూరు సీడీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఝాన్సీ

రేపల్లె: అంగన్‌వాడీలు, ఆయాలకు ఫోన్ యాప్‌ల భారాన్ని తగ్గించాలని, ఫేస్ యాప్‌లను రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం సీడీపీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి సీడీపీవో సుచిత్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ మాట్లాడుతూ అంగన్‌వాడీలు, హెల్పర్‌లు, మినీహెల్పర్‌లు తమ హాజరుతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల హాజరుకు సంబంధించి ప్రతి రోజు ఫేస్‌ను యాప్‌లలో నమోదు చేయాలని ప్రభుత్వం నిబంధన పెట్టడం వర్కర్‌లకు భారంగా మారుతోందన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలను పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవని యాప్‌లో నమోదు చేయడం, ఈ కేవైసీ, ఓటీపీ తదితర ప్రక్రియల అనంతరం పౌష్టికాహారం అందించాలన్న నిబంధన పెట్టడంతో సాంకేతికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సాంకేతిక లోపంతో పౌష్టికాహారం ఇవ్వలేకపోతే లబ్ధిదారుల నుంచి అంగన్‌వాడీలకు ఒత్తిళ్లు పెరుగుతున్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం, పప్పు, నూనె, గుడ్లు వంటి వస్తువులు ఒక్కసారిగా సరఫరా కావటంలేదని, ఆ వస్తువులు అందజేసే ప్రతిసారి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తుడడంతో ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విధానాన్ని రద్దు చేసి అంగన్‌వాడీలపై ఫోన్ యాప్ భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, యూనియన్ నాయకులు రత్నకుమారి, ఎస్.కృష్ణకుమారి, డి.జ్యోతి, అరుణ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పల్లపట్లలో అంగన్‌వాడీల నిరసన

నిజాంపట్నం: అంగన్‌వాడీ లబ్ధిదారులకు ఫేస్ యాప్ రద్దు చేయాలని, అన్ని యాప్‌లను కలిపి ఒక యాప్‌గా మార్చాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం పల్లపట్ల సీడీపీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ పల్లపట్ల అధ్యక్షురాలు మేరిమణి, సభ్యులు బేబీరాణి, రమాదేవి, దిల్షాద్, సీతామహాలక్ష్మి, అచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు యాప్‌లు రద్దు చేయాలి

అమర్తలూరు(వేమూరు): అంగన్‌వాడీలకు ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లు రద్దు చేయాలని అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షుడు బొనిగల అగస్టీన్ అన్నారు. మండల కేంద్రంలోని సీడీపీవో కార్యాలయంలో సీడీపీవో ఎ.లక్ష్మికి వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న సరుకులు పోషణ ట్రాకర్ బాల సంజీవని యాప్ ద్వారా ఇవ్వాలని ఆదేశించాయని, కానీ అందుకు సరైన ఫోన్ లేదని, 5జీ స్పీడ్ నడుస్తున్న ఈ కాలంలో 2జీ నెట్‌వర్క్ ఫోన్లు ఇచ్చారన్నారు. ఫోన్‌లు సరిగా పనిచేయడం లేదని, ప్రభుత్వం అంగన్‌వాడీ కార్యకర్తలకు పని చేసే ఫోన్‌లు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుజాత, ఎం.రాణి, ఎస్.బుల్లెమ్మాయి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తీసుకుంటాం

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ



మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెనాలి డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ యాక్టు సబ్ డిస్ట్రిక్ట్ తెనాలి లెవల్ సలహా సంఘ సమావేశాన్ని సోమవారం పాత ప్రభుత్వ వైద్యశాలలోని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయివేట్ వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్, లేబరేటరీ నిర్వాహకులు లింగ నిర్ధారణపై ఎటువంటి వాణిజ్య ప్రకటనలు ఇవ్వకూడదని సూచించారు. అలా చేసిన వారికి మూడు సంవత్సరాల జైలు, రూ.50 వేల అపరాధ రుసుం విధించటం జరుగుతుందన్నారు. అలాగే వైద్య మండలి ధ్రువీకరణ పత్రాన్ని అయిదు సంవత్సరాల పాటు రద్దుచేయటం జరుగుతుందని తెలిపారు. రెండవ సారి కూడా ఇలా చేస్తే అయిదు సంవత్సరాల జైలు, రూ.లక్ష జరిమానా విధిస్తామన్నారు. ఆడపిల్లలను తక్కువ చూపుతో చూడవద్దన్నారు. సమావేశంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ వినీల్, డాక్టర్ సురేష్, డాక్టర్ మానస, డాక్టర్ వేముల ప్రియాంక, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి ముమ్మనేని భానుమతి, పెనుగొండ వెంకటేశ్వర రావు, నాళం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

లంకవాసులు.. అప్రమత్తంగా ఉండండి

కొల్లిపర: గత నాలుగు రోజులుగా పలుచోట్ల కురుస్తున్న వర్షాలకు సాగర్ డ్యాం నుంచి 3 లక్ష వరద నీరు సోమవారం కృష్ణా నదికి వదలిన నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జి.సిద్ధార్థ, ఎంపీడీవో వి.విజయలక్ష్మిలు సూచించారు. సోమవారం వారిరువురు కృష్ణా నది రేవులను పర్యవేక్షించి అనంతరం లంక గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ నదిలోకి వరద నీరు చేరటం వలన లంక గ్రామాలకు, కూలీ పనులకు వెళ్లే వారు వరద ఉధృతి తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి సమయంలో పడవ వేయు వారికి తప్పని పరిస్థితిలోనే మాత్రం పడవ వేయాలని హెచ్చరించారు. నది తీవ్రత ఉన్నపుడు పిల్లలు, వృద్ధులు ఇటు వైపు రాకుండా ఉండేలా గ్రామ పెద్దలు, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో, సచివాలయం సిబ్బందితో, వీఆర్‌వోలతో మాట్లాడుతూ గ్రామాలోని పరిస్థితులు ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తు తమకు తెలపాలన్నారు. రానున్న రోజుల్లో వరద ఉధృతి పెరిగే విధంగా ఉంటే లంక ప్రజలను తూములూరు, కొల్లిపర, పాఠశాలలోకి తీసుకువచ్చే విధంగా ముందస్తుగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో, ఆర్‌ఐ వంశీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

ఇళ్లు కట్టిస్తానని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణం పేరిట లబ్ధిదారులను మోసం చేసిన కాంట్రాక్టర్ను రూరల్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు. రూరల్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకంలో లబ్ధిదారులకు ప్రభుత్వం స్థలం కేటాయించి, గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ క్రమంలో పెదరావూరు లేఔట్‌లో ఎస్‌జీ బిల్డింగ్ వర్క్స్ పేరిట పట్టణ 24వ వార్డు శాంతినగర్‌కు చెందిన కాంట్రాక్టర్ కమ్ ఏజెంట్ ఎం. పున్నారావు గృహ నిర్మాణానికి ముందుకు వచ్చాడు. లబ్ధిదారులతో అగ్రిమెంట్లు చేయించుకొని ఏ ఒక్క ఇంటిని పూర్తిగా నిర్మించకుండా, కొంత మాత్రమే పనులు చేసి వదిలేశాడు. బుర్రిపాలెం, నేలపాడు లేఅవుట్‌లలో కూడా ఇదే విధంగా వ్యవహరించడంతో గతంలో అతడిని చేశారు. పెదరావూరు లేఅవుట్ విషయంలో నిందితుడిని పీటీ వారెంట్ పై నరసరావుపేట సబ్ జైలు నుంచి తీసుకువచ్చి సోమవారం కోర్టులో హాజరు పరచగా అతనికి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ కె. ఆనంద్ తెలిపారు. వెంటనే తిరిగి నరసరావుపేట సబ్ జైలుకు తరలించినట్టు చెప్పారు.